క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

అమరాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉదయం 10:30 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ మునిస్వామి, ఎంపీపీ ఈరన్న తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని మండలస్థాయి అధికారులు నివేదికతో తప్పక హాజరు కావాలన్నారు. అలాగే ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ద్విచక్ర వాహనాల ఢీ

మడకశిరరూరల్: పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో చిరంజీవి అనే వ్యక్తితో పాటు మరొకరికి గాయాలయ్యాయి. వారిని వెంటనే 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. పట్టణంలో వాహనదారులు జాగ్రత్తగా వాహనాలు నడపాలని పోలీసులు సూచించారు.

సమస్యలు పరిష్కరించండి

పెనుకొండ: సీపీఎస్ రద్దు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సీపీఎస్ రద్దు చేయాలని, పెండింగ్ డీఏలు చెల్లించాలని, 3, 4, 5 తరగతుల విలీనాన్ని రద్దు తదితర సమస్యలన్నీ పరిష్కరించాలంటూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు కోడూరు శ్రీనివాసులు, జవ్వాజి నాగరాజు, యాఖూబ్, గోపాల్, చంద్ర, అమీర్‌వలి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చింతఫల సాయం వేలం



మల్లినమడుగులో వేలం పాటను నిర్వహిస్తున్న ఈఓఆర్డీ క్రిష్టప్ప

రొళ్ల: మండల పరిధిలోని మల్లినమడుగు, బీజీ హళ్లి పంచాయతీ కేంద్రంలో బుధవారం చింతఫల సాయం కోసం ఆయా పంచాయతీల సర్పంచులు శారదమ్మ, సదాశివప్ప అధ్యక్షతన వేలం పాట నిర్వహించినట్లు ఈఓఆర్డీ క్రిష్టప్ప తెలిపారు. మల్లినమడుగు చింత ఫల సాయం రూ.3 వేలకు, బీజీ హళ్లి చింతఫల సాయం రూ.5 వేలకు వేలం పాడి దక్కించుకున్నారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు శ్రీనాథ్, అహల్యా, వ్యాపారస్తులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

సోమందేపల్లి: మండలంలోని పాపిరెడ్డిపల్లి క్రాస్ వద్ద జాతీయ రహదారిపై రెండు కార్లు ఢీ కొన్న సంఘటనలో ఇద్దరు గాయపడ్డారు. బుధవారం ఉదయం పెనుకొండ వైపు నుంచి చిక్కబళ్లాపురం వైపు వెళుతున్న మారుతీ కారును హైదరాబాదు వైపు నుంచి బెంగళూరు వెళుతున్న మరో కారు వెనుక నుంచి ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. మారుతీ కారులో ఉన్న అంశాద్‌ఖాన్, పీర్ బాషాలకు గాయాలయ్యాయి. చికిత్సకోసం వారిని బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

సోమందేపల్లి: మండలంలోని చాలకూరు గ్రామం వద్ద ఓ ఇసుక ట్రాక్టర్‌ను బుధవారం సీజ్ చేసినట్లు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు. కేతగాని చెరువు నుంచి సోమందేపల్లి వైపు అనుమతులు లేకుండా ట్రాక్టర్‌లో ఇసుక తీసుకొని వస్తున్నట్లు సమాచారం రావడంతో ఆ ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వివాదాస్పద స్థలం పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న ఎంపీపీ చంద్రశేఖర్

రొద్దం: మండల పరిధిలోని ఆర్ మరువపల్లి పాత చెక్ పోస్టు వద్ద సర్వే నంబర్ 836లో వివాదాస్పద స్థలాన్ని బుధవారం ఎంపీపీ చంద్రశేఖర్ పరిశీలించారు. కొన్నేళ్ల క్రితం పలువురు దళితులకు మాజీ ఎమ్మెల్యే రమణారెడ్డి హయంలో ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. అయితే కొందరికి ప్రస్తుత ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసింది. ఇళ్ల నిర్మాణంలో ఇరువర్గాల మధ్య స్థల వివాదం తలెత్తింది. దీంతో ఇరువర్గాల వారు అధికారులకు ఫిర్యాదులు చేసుకోవడంతో ఆ స్థలాన్ని ఎంపీపీ పరిశీలించారు. ఇద్దరికీ సర్ది చెప్పి సమస్య పరిష్కరంచారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య పాల్గొన్నారు.

మరో 30 ఏళ్లు జగనన్నే ముఖ్యమంత్రి

• ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్



వైఎస్సార్‌సీపీలో చేరిన ఎంఐఎం నాయకులతో ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్



హిందూపురం: రహమత్‌పురంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

హిందూపురం: 'దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుస్తున్నారు. అందరి మన్ననలను పొందుతున్న జగనన్న మరో 30 ఏళ్లు ముఖ్యమంత్రి కొనసాగుతారు'. అని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాలను చూసి ఆకర్షితులై ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గు చూపుతున్నారని చెప్పారు. పట్టణంలోని ప్రశాంత్ నగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 15 వార్డు ఇన్‌చార్జి సలీం ఆధ్వర్యంలో ఎంఐఎం నుంచి పెద్ద ఎత్తున యువకులు ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ నాయకత్వాన్ని బలపర్చుతూ వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్సీ పార్టీ కండువలను వేసి సాదరంగా ఆహ్వానించి ఆహ్వానించారు. ఈ సందర్భంగా షబీర్, నయాజ్, రఫీక్, ఆయూబ్, రిజ్వాన్, అస్లాం, బాబావలి, అక్రమ్, అక్బర్, నస్రూ, జబీలతో పాటు మరో 15 మంది పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇక్బాల్ మాట్లాడుతూ పార్టీలో యువత చేరిక పార్టీకి మరింత బలాన్నిస్తుందన్నారు. వీరి చేరికతో రహమత్‌పురం ప్రాంతంలో పార్టీకి మరింత పట్టు ఏర్పడిందన్నారు. ప్రజా సంక్షేమ పాలనతో ప్రజల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్ల ప్రేమానురాగాలు, అభిమానం నిండిపోయిందన్నారు. జనంలో జగనన్నకు పెరిగిపోతున్న ఆదరణ చూసి ఓర్వలేకనే టీడీపీ, జనసేన, బీజేపీ ఇతర పార్టీలన్నీ ఎలాగైనా ఈసారి జగన్‌మోహన్‌రెడ్డిని అడ్డుకోకపోతే మనుగడ లేదని కుయుక్తులు పన్నుతున్నాయని చెప్పారు. ఎందరు కలసి వచ్చినా ప్రజల ఆశీర్వాదం, దేవుడి దయతో సింహంలా ఒంటరిగానే జగనన్న నిలిచి పోరాడి గెలుస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, కౌన్సిలర్ అయూబ్, నాయకులు చాందూ, సోమశేఖర్‌రెడ్డి, మన్సూర్, రహమత్, సమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

'ప్రజా సమస్యల పరిష్కారం, సౌకర్యాల కల్పనకు వెనుకాడేది లేదు.. సీఎం జగనన్న చేసేదే చెబుతారు... చెప్పిందే చేస్తారు' అని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. బుధవారం సాయంత్రం 16వ వార్డు రహమత్‌పురం ప్రాంతంలో పార్టీ నాయకులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా రహమత్‌పురం ప్రాంతంలో కాలువలు, రోడ్లు ఇబ్బందులున్నాయని స్థానికులు ఎమ్మెల్సీ దృష్టికి తెచ్చారు. అలాగే మరికొందరు ఇంటి స్థలాలు, పింఛన్లు ఇప్పించాలని విన్నవించారు. ప్రజల ఇబ్బందులు తెలుసుకున్న ఎమ్మెల్సీ ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉందని కోడ్ పూర్తవగానే తక్షణం సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇక్బాల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజా సమస్యలన్నీ తక్షణ పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా సంతోషంగా ఉండాలన్నదే సీఎం లక్ష్యమన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని చెప్పారు.

మంచి చేస్తున్నామనే ..

రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తూ ప్రజలందరికీ మంచి చేస్తున్నమనే ప్రజల మధ్యకు ధైర్యంగా వచ్చి వారితో మమేకం కాగలుగుతున్నామని ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్ అన్నారు. 35 ఏళ్లు హిందూపురంలో గెలుస్తూ వచ్చిన టీడీపీ ఎమ్మెల్యేలు, ఆ పార్టీ నాయకులు ఇలా ఇంటింటికీ ఎప్పుడైనా వచ్చి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ప్రజలను అడిగిన పాపానపోలేదన్నారు. ఎన్నికల సమయంలో ఆర్భాటం చేసి మభ్య పెట్టె మాటాలతో అరచేతిలో వైకుంఠం చూపి ప్రజలను మోసం చేస్తూ వచ్చారని విమర్శించారు. సినిమా మేకప్‌లతో వచ్చి డైలాగులు చెబితే ప్రజలు నమ్మేసి ఓట్లు వేసేస్తారని అనుకుంటున్నారని, ఈసారి ఆ పప్పులు ఉడకవని చెప్పారు. ప్రజలందరూ చైతన్యవంతులయ్యారని, మభ్యపెట్టె మాటలు ఇక నమ్మబోరన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, కౌన్సిలర్లు మల్లికార్జున, పార్టీ నాయకులు షఫీ, సలీం, ఫరూక్, ఆబూసర్, అజుబా, సాధిక్, గాంధీ, వార్డు కన్వీనర్ ఫర్హీన్ సల్మా తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ



మాట్లాడుతున్న బలిజ సంఘం నాయకులు

హిందూపురం టౌన్: విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణకు కుల, మత, రాజకీయాలకు అతీతంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బలిజ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బలిజ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని ప్రాంతాల నుంచి బలిజ కులస్తులు, ప్రజలు పాల్గొనాలని కోరారు. అనంతరం విగ్రహావిష్కరణ కరపత్రాలు విడుదల చేశారు. సమావేశంలో బలిజ సంఘం నాయకులు రాయల్ గోపాల్, వెంకటరాముడు, నారాయణ, నాగరాజు, గిరీష్‌కుమార్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లపై సమీక్ష



పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై చర్చిస్తున్న అధికారులు

హిందూపురం: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో హిందూపురం నియోజకవర్గం పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై బుధవారం మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారులు ఎంజీఎం హైస్కూల్‌ను పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని ఏడు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, అందులో ఆరు కేంద్రాలు పట్టభద్రులకు కేటాయించి, ఒకటి టీచర్స్ పోలింగ్ బూత్‌గా ఏర్పాటు చేస్తున్నామని ఎన్నికల అధికారులు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సౌజన్య, సీఐలు ఈరన్న, వేణుగోపాల్ తెలిపారు. ఎంజీఎం స్కూల్‌లో పోలింగ్ కేంద్రాలు, వాటి భద్రత ఇతర సదుపాయలను పరిశీలించారు. తర్వాత మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో సమావేశమై మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై చర్చించారు.

ఆదాయ వనరుల పెంపునకు కృషి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ శివారెడ్డి

మడకశిరరూరల్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఆదాయ వనరులను పెంపొందించుకోవడానికి కృషి చేయాలని డీఎల్‌డీఓ శివారెడ్డి ఉద్యోగులకు సూచించారు. బుధవారం మధ్యాహ్నం ఆమిదాలగొంది గ్రామ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం, సచివాలయ సేవలు, సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ సచివాలయంలో రికార్డులను పక్కాగా ఉంచుకోవాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వీడి ప్రజలకు సక్రమంగా సేవలు అందించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. అలాగే మెళవాయి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ సోనిబాయి తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పలువురు ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని తమ దృష్టికి వచ్చిందని, పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శైలజ, కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రికవరీలో నిర్లక్ష్యమెందుకు?



ఉపాధి పనులపై సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీవీఓ రమణారెడ్డి

లేపాక్షి: జాతీయ ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న ఇద్దరు ఏపీఓలతో పాటు కంప్యూటర్ ఆపరేటర్, సిబ్బందిపై ఉపాధి హామీ పథకం జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మధ్యాహ్నం లేపాక్షి మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఇందులో భాగంగానే ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గతంలో ఓపెన్ ఫోరంలో వెల్లడించిన మొత్తాల రికవరీలను ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. అలాగే ఉపాధి పనులు జరిగిన రైతుల పొలాల్లో నేమ్ బోర్డులు చాలా ఏర్పాటు చేయలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పనితీరు మార్చుకోవాలని, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని హెచ్చరించారు.

పనులు నాణ్యతగా చేయాలి



ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామారావు

రొళ్ల: గ్రామాల్లో ఉపాధి పథకం కింద చేపట్టిన పనులను నాణ్యతగా ఉండేలా క్షేత్రసహాయకులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రామారావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో టీఏలు, ఎఫ్ఏలు, సీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామారావు మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరంలో గుర్తించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా 2023–24 ఆర్థిక సంవత్సవరంలో అవసరమైన పనులను గుర్తించి మంజూరు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాలన్నారు. ఉపాధి పథకం ద్వారా శాశ్వతమైన పనులు చేపట్టడం వల్ల రైతులకు, ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ముఖ్యంగా చెక్‌డ్యాం నిర్మాణాలు, కుంటలు, చెరువులో పూడిక తీత పనులు చేపట్టడంతో పాటు పొలం చుట్టు కందకాలు తవ్వడం, సన్నచిన్న కారు రైతుల పొలాల్లో పండ్ల తోటలు పెంపకం, భూములు చదును చేసే వంటి కార్యక్రమాలు చేపట్టాడానికి శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఉండి జాబ్‌కార్డు కాలిగిన ప్రతి కూలీకి వంద రోజుల పని కల్పించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ నాగరాజు, టీఏలు, ఎఫ్ఏలు, సీఓలు తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ముస్తాబైన శ్రీకైలాసం



ఆలయంలో ఉన్న శివలింగం



ఏడుగురు అక్కమ్మగార్ల దేవాలయం

పెనుకొండ రూరల్: పెనుకొండ మండల పరిధిలోని దుద్దేబండ పంచాయతీ గొందిపల్లి కొండల్లో వెలసిన శ్రీకైలాసం క్షేత్రం మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబవుతోంది. పెనుకొండకు 20 కి.మీ దూరంలో ఉన్న ఈ ఆలయంలో శివుడు లింగం రూపంలో దర్శనమిస్తారు. అలాగే కొండల్లో వెలసిన ఏడుగురు అక్కమ్మ గార్ల ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఏళ్ల కిత్రం వర్షం కోసం ప్రజలు కాలినడకన ఈ ప్రాంతానికి వచ్చి పూజలు చేసేవారని, తిరిగి వెళ్లే సమయానికి వర్షం పడేదని భక్తులు చెబుతున్నారు. కైలాసగిరి శిఖరంపై ఏడు చెలిమిల నుంచి తీవ్ర వర్షాబార సమయాల్లో సైతం నిత్యం జల ధార ప్రవహిస్తుండటం విశేషం. గొందిపల్లి, ధర్మవరం, గుత్తి తదితర ప్రాంతాల భక్తులు జనవరిలో శివమాల ధరించి దీక్ష ముగిసే వరకు ఇక్కడే ఉంటారని అర్చకులు చెబుతున్నారు.

మహాశివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు

మహాశివరాత్రిని పురస్కరించుకొని శ్రీకైలాసం క్షేత్రంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శనివారం భువనేశ్వరి సమేత కైలాస నాథుడి ఊరేగింపు, అక్కమ్మగార్లకు ఎలవగంప, పూలగంప, గంగా కావిడి పూజలు చేయనున్నట్లు చెప్పారు. అలాగే పరమేశ్వరుడికి నారికేళ అభిషేకం, హోమాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. తెల్లవారు జామున 3 గంటలకు అఖండ దివ్యజ్యోతి వెలిగించనున్నట్లు అర్చకుడు తిరుపతిస్వామి పేర్కొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివార్లను దర్శించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సేవలు సద్వినియోగం చేసుకోండి

మడకశిరరూరల్: ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మేనేజర్ ప్రవీణ్‌కుమార్ కోరారు. బుధవారం మధ్యాహ్నం జమ్మానిపల్లిలో ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యతపై ఖాతాదారులు, ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలకు వివరించారు.

సజావుగా ఇంటర్ పరీక్ష

అమరాపురం: మండలంలోని మోడల్ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలు బుధవారం సజావుగా జరిగాయి. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు నైతిక విలువలు, మానవ విలువలు అనే అంశంపై బుధవారం పరీక్ష నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఓబళపతి, అపర్ణ పరీక్షలను పర్యవేక్షించారు.

విద్యార్థినికి అభినందన

పరిగి: మండలంలోని ధనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మంజుల రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక పాఠశాలలో బుధవారం విద్యార్థిని మంజులను, గైడ్ టీచర్ ఎరిదేవిని హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించింది.

ఉపాధి కూలీల సంఖ్య పెంచండి

రొద్దం: మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఏపీడీ జయసింహ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు భవనంతో ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఏపీడీ మాట్లాడుతూ కూలీల బిల్లులు సకాలంలో వారి ఖాతాలోకి జమ అవుతున్నాయని చెప్పారు. ప్రతి గ్రామంలో కూలీల సంఖ్య పెంచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ జగదీశ్వర్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈసీ తదితరులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

అమరాపురం: మండలంలోని 11 పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని అధికారులకు ఎంపీడీఓ మునిస్వామి సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన అధికారులతో ఉపాధి హామి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

రీసర్వే పక్కాగా నిర్వహించాలి

అమరాపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో భూ రీసర్వేను పక్కాగా నిర్వహించాలని అధికారులకు తహసీల్దార్ సురేష్‌కుమార్ సూచించారు. బుధవారం సాయంకాలం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ, మండల సర్వేయర్, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భూ సమగ్ర సర్వేను అధికారులు సంయుక్తంగా పక్కాగా నిర్వహించాలన్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది తలెత్తకూడదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల నియమావళి తప్పక పాటించాలన్నారు. ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో డీటీ.గురుబ్రహ్మ, ఆర్ఐ.లక్ష్మీ, మండల సర్వేయర్ దినేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేద్దాం

అమరాపురం: మండలంలోని హేమావతిలో ఈ నెల 18 నుంచి జరగనున్న సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని సర్పంచ్ తిప్పేస్వామి పేర్కొన్నారు. బుధవారం సాయంకాలం స్థానిక సచివాలయంలో కార్యదర్శి నరేష్ ఆధ్వర్యంలో సచివాలయం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్, కార్యదర్శి మాట్లాడుతూ ఉత్సవాలు 8 రోజుల పాటు జరుగుతాయని, ఈ ఉత్సవాలకు ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాక సమీప కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తారన్నారు. వచ్చే భక్తులకు తాగునీరు, వసతి, తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ

అమరాపురం: ప్రతి విద్యార్థి ఇష్టంతో చదివి పరీక్షలు బాగా రాసి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఓబళపతి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మోడల్ పాఠశాల ఆవరణలో ఇంటర్ విద్యార్థులు సరస్వతీ పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు మంజునాథ సరస్వతీ, వినాయకుడు, శివలింగాలను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం తదితర పూజలు చేశారు. సమావేశంలో ప్రిన్సిపాల్ ఓబళపతి, ఉపాధ్యాయులు మోహన్‌కృష్ణ, సత్యం, రామసుబ్బయ్య, భాషా విద్యార్థులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో మోడల్ పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

విగ్రహాలకు ముసుగు



ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు వేస్తున్న రెవెన్యూ సిబ్బంది

లేపాక్షి: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండల వ్యాప్తంగా ఉన్న రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయడంతో పాటు వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన బ్యానర్లును తహసీల్దార్ బాబు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది బుధవారం తొలగించారు. రాజకీయ పార్టీ నాయకులు ఎన్నికల కోడ్‌ను తప్పక పాటించాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నూతన తహసీల్దార్‌గా సుజాత

పావగడ: నూతన తహసీల్దార్‌గా సుజాత బుధవారం బాధ్యతలు చేపట్టారు. కేజీఎఫ్ నుంచి ఆమె బదిలీపై పావగడ వచ్చారు. విధాన సభ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకు తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన వరదరాజు బెంగళూరు ప్రధాన కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక కసబ ఆర్ఐ రాజగోపాల్ తదితర రెవెన్యూ అధికారులు, ఉద్యోగ సిబ్బంది నూతన తహసీల్దార్‌కు స్వాగతం పలికారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత

గుడిబండ: మండల పరిధిలోని మైనిగానిపల్లికి చెందిన నరసింహుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ లక్ష్మీనారాయణ, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగేంద్ర మైనిగానిపల్లి వెళ్లి నరసింహుడు భార్య భాగ్యమ్మకు రూ.10 వేలు తక్షణసాయం అందజేశారు.

ఘనంగా సేవాలాల్ జయంతి

పావగడ: బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ 284వ జయంతి వేడుకలను స్థానిక తాలూకా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లంబాడి సామాజిక వర్గానికి చెందిన కృష్ణానాయక్, శకుంతలాబాయి, ఆర్ఐ రాజగోపాల్, సర్వేశాఖ సూపర్‌వైజర్ జీసీ కృష్ణప్ప, వాల్యానాయక్, గోవిందనాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

మడకశిరరూరల్: మండల పరిధిలోని గొల్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రంగస్వామప్ప (65) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. మండల పరిషత్ వైస్ ఎంపీపీ మూర్తి, సర్పంచ్ కరియన్న , మండల ఎస్సీ సెల్ నాయకులు లక్ష్మీనారాయణ. నాయకులు నటరాజ్, హనుమంతరాయప్ప, రాజేష్ తదితరులు రంగస్వామప్ప భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అలాగే మాజీ మంత్రి రఘువీరారెడ్డి, వక్కలిగ సంఘం నాయకులు అనంతరాజు తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

అరసికెరలో విజ్ఞాన శిక్షణ శిబిరం



విద్యార్థులకు విజ్ఞాన ప్రయోగాలు వివరిస్తున్న గంగాధరప్ప

పావగడ: తాలూకాలోని అరసికెర గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం విజ్ఞాన శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విజ్ఞాన శాస్త్ర సంపన్మూల వ్యక్తి గంగాధరప్ప పాఠశాల పరిధిలోని విజ్ఞాన ఉద్యాన వనంలో సుమారు 28 నమూనాలను పరిచయం చేస్తూ వాటి తత్త్వం, అన్వయం, కార్య నిర్వహణలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ ఎం గోవిందప్ప, సౌమ్య, ప్రభురాజ్, గురురాజ్, విమల, రశ్మి,మానస పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించండి

పెనుకొండ: మున్సిపల్ పరిధిలోని ఇస్లాపురం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఏఈ రాజేంద్రకు గ్రామస్తులు, సీఐటీయూ నాయకులు బుధవారం వినతిపత్రం అందించారు. నాయకులు రమేష్, బాబావలి, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

హిందూపురం డివిజన్
9912220723, 9705346587
9010200238, 9912220726